క్లుప్తంగా

కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని నినాదాలు చేస్తున్న అమలాపురం యూనియన్ సభ్యులు

అమలాపురం టౌన్: మోటారు సైకిళ్ల మెకానిక్స్‌కు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, రూ.3 లక్షల వరకూ ష్యూరిటీ లేని రుణాన్ని ఇవ్వాలని స్థానిక గడియారం స్తంభం సెంటర్‌లో మెకానిక్కులు శుక్రవారం నినాదాలు చేశారు. ప్రపంచ టూ వీలర్స్ మెకానిక్స్ దినోత్సవాన్ని పట్టణ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 55 ఏళ్లు దాటిన మెకానిక్కులకు నెలకు రూ.5 వేల చొప్పున పెన్షన్ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. అమలాపురం శ్రీ వరసిద్ధి వినాయక మోటార్ సైకిల్ మెకానిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.రెడ్డినాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సభ్యులు నరసింహరావు, శ్రావణకుమార్, బాల, శ్రీనివాసరావు, గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీసీఐ అనుసంధానం తప్పనిసరి

అమలాపురం రూరల్: తల్లికి వందనం 2వ విడత నగదు జమ చేయడానికి బ్యాంకు ఖాతా, పోస్టల్ ఖాతాలకు తప్పనిసరిగా ఎన్‌పీసీఐ అనుసంధానం చేసుకోవాలని లబ్ధిదారులకు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ సాధికారిత అధికారి పి.జ్యోతిలక్ష్మిదేవి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అమరావతి సాంఘిక సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు సచివాలయాల పరిధిలో బ్యాంకు ఖాతా లేదా పోస్టల్ ఎన్‌పీసీఐ ఖాతాలను అనుసంధానం కాని విద్యార్థులు వెంటనే అనుసంధానం చేయించుకోవాలన్నారు. పోస్ట్ ఆఫీస్‌లో సంప్రదించి వెంటనే పోస్టల్ అకౌంట్ ఓపెన్ చేయాలన్నారు. 1వ తరగతి విద్యార్థులకు తల్లుల బ్యాంకు అకౌంట్‌లో నగదు జమచేస్తారన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు వారి బ్యాంకు ఖాతాలోనే నగదు జమ అవుతుందన్నారు.

డీపీవో తనిఖీలు

అమలాపురం రూరల్: రూరల్ మండలంలో భటనవిల్లి గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతా లక్ష్మి శుక్రవారం తనిఖీ చేశారు. తడి చెత్త-పొడి చెత్త సేకరణ తీరుపై సిబ్బందిని ఆరా తీశారు. పారిశుధ్య కార్మికులకు ప్రజలు చెత్తను సేకరించి వేరు వేరుగా ఇవ్వాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రెడ్డి శిరీష, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూలకు 22 మంది హాజరు

యానాం: జిప్‌మెర్ ప్రభుత్వ ఆసుపత్రిలో స్పెషలిస్ట్ వైద్యులు, జనరల్ మెడిసిన్ వైద్యుల కోసం శుక్రవారం నిర్వహించిన వాక్ ఇన్ ఇంటర్వ్యూలకు మొత్తం 22 మంది హాజరైనట్లు చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆనంద్‌రాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైనవారికి త్వరలో నియామక ఉత్తర్వులు అందిస్తామన్నారు.

జవహర్‌కు అదనపు బాధ్యతలు

యానాం: పుదుచ్చేరి చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ పి.జవహర్, ఐఏఎస్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శరత్ చౌహాన్ ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా ప్రస్తుతం నిర్వహిస్తున్న చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈఓ)కు తోడు అదనంగా ఫారెస్ట్స్ వైల్డ్‌లైఫ్ అండ్ సైన్స్, టెక్నాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్ కమిషనర్ కమ్ సెక్రటరీగా బాధ్యతలు అప్పగిస్తు ఉత్తర్వులు జారీ చేశారు.

వర్కర్ల సమ్మె తాత్కాలిక విరమణ

అమలాపురం టౌన్: జిల్లాలోని అమలాపురం, రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీల్లో గత 58 రోజులుగా అవుట్ సోర్సింగ్ ఇంజినీరింగ్ వర్కర్లు చేస్తున్న సమ్మెను తాత్కాలికంగా విరమించినట్లు ఆ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు యెరుబండి వెంకట సత్యనారాయణ తెలిపారు. ఈ నెల 3న ఇంజినీరింగ్ వర్కర్ల యూనియన్ నిర్వహించిన చర్చల్లో ప్రభుత్వం సానుకూలంగా స్పందిందడం, డిమాండ్లపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనుండడంతో సమ్మె విరమిస్తున్నట్లు ఆయన అమలాపురంలో శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్తర్వులు జారీ చేయని పక్షంలో సమ్మెను పునః ప్రారంభిస్తామని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్‌కు సమ్మె తాత్కాలిక విరమణ పత్రాన్ని శుక్రవారం ఆయన ఛాంబర్‌లో అందచేశారు. మూడు మున్సిపాలిటీల్లో వర్కర్లు శనివారం నుంచి విధులకు హాజరుకానున్నారు.

ఫ్రైడే-డ్రైడే నిర్వహించకపోతే చర్యలు

అమలాపురం రూరల్: ప్రజల ప్రాణాలకు హాని కలిగించే దోమల నిర్మూలనకు ప్రతీ శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాలు నిర్వహించకపోతే సంబంధిత హెల్త్ సిబ్బందిపై చర్యలు తీసుకోంటామని జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు హెచ్చరించారు. డెంగీ మాసోత్సవాల్లో భాగంగా కామనగరువు పరిధిలో బడుగువారిపేటలో శుక్రవారం హెల్త్ సిబ్బంది చేపట్టిన డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలను చైతన్యం చేయావల్సిన బాధ్యత హెల్త్ సిబ్బందిపై ఉందన్నారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష..!

- సీజనల్ వ్యాధుల సమయం
- డేంగీ డెంజర్ బెల్స్
- అప్రమత్తంగా ఉండాలంటున్న నిపుణులు



కేశనకుర్రులో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు



మురమళ్లలో నివాసాల చెంత పేరుకుపోయిన వ్యర్థాలు

ఐ.పోలవరం: ఓ వైపు అడపాదపా కురుస్తున్న వర్షాలు, మరోవైపు చురుక్కు మనిపిస్తున్న ఎండలు..సీజనల్ వ్యాధుల వ్యాప్తికి ఇంతకంటే ఏం కావాలి. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతోనే ఈ వ్యాధుల భారి నుంచి తప్పించుకోవచ్చని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలో మొత్తం 120 గ్రామాలు ఉన్నాయి. పట్టణంలో ఏరియా ఆసుపత్రితో పాటు రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. ముమ్మిడివరం, కొత్తలంక, తాళ్లరేవు, సీహెచ్‌సీ సెంటర్లు, గాడిమొగ, పల్లంకుర్రు, కాట్రేనికోన, ఉప్పలగుప్తం, భీమనపల్లి, ఎస్.యానాం, బండారులంక, పేరూరుల, గొడిలంక, బెండమూర్లంకలో పీహెచ్‌సీ సెంటర్లు అందుబాటులో ఉన్నాయి. ఇటీవల వీటి పరిధిలో సాధారణ జ్వర పీడితులు, మలేరియా బాధితులు క్రమంగా పెరుగుతున్నారు. ప్రస్తుతానికి వీరి సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ వాతావరణ పరిస్థితుల ప్రభావంతో సంఖ్య మరింత పెరగనుంది.

కారణాలు అనేకం..

వాతావరణంలో చోటు చేసుకునే మార్పుల ఫలితంగా సీజనల్ వ్యాధులైన వైరల్ ఫీవర్, టైఫాయిడ్, మలేరియా, చికెన్ గున్యా లాంటి వ్యాధులతో పాటు విష జ్వరాల ప్రభలే అవకాశం ఎక్కువగా ఉంటుంది. వర్షాకాలంలో వాతావరణ మార్పులు, తేమ, గాలిలో తేడాలు సూక్ష్మజీవుల పెరుగుదలకు దోహదం చేస్తాయి. మలేరియా జ్వరానికి కారణమయ్యే ప్లాస్మోడియం పరాన్నజీవి ఆడ అనాఫిలిస్ దోమ ద్వారా వ్యాపిస్తుంది. ఈ దోమ ఎక్కువగా మురుగు నీటిలో పెరుగుతుంది. (ప్లాస్మోడియం వైవాక్స్, పాల్సీఫారం) వీటిలో ఏది వచ్చినా ముప్పు తప్పదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

పిల్లల సంరక్షణ తప్పనిసరి

పిల్లలు ఏడాది పొడవునా వివిధ ఆరోగ్య సమస్యలకు గురవుతారు, కానీ కొన్ని వ్యాధులు నిర్దిష్ట సీజన్లలో ఎక్కువగా ప్రబలంగా ఉంటాయి. తల్లిదండ్రులు వారి పిల్లలు ఆరోగ్యంపై ఒక కంటా కనిపెడుతూ ఉండాలి. ఈ మేరకు వారికి వ్యాధులపై అవగాహన కల్పించాలి. వేసవి నుంచి వర్ష కాలానికి మారే సమయంలో ఉష్ణోగ్రత, తేమలో మార్పుల కారణంగా పిల్లలు న్యుమోనియా వంటి శ్వాసకోశ వ్యాధులకు ఎక్కువగా గురవుతారు.

తీరప్రాంతం..

ఈ రెండు నియోజకవర్గాలలో తీర ప్రాంత గ్రామాలు అధికం. తాళ్లరేవు మండలం పరిధిలో గాడిమొగ, ఐ.పోలవరం మండలంలో భైరవపాలెం, గోగ్లంక, భైరవలంక, కాట్రేనికోన మండలం పరిధిలో నీళ్లరేవు, కొత్తపాలెం, ఏటిమొగ పల్లం, చిర్రయానాం, బలుసుతిప్ప, ఉప్పలగుప్తం మండలం పరిధిలో ఎస్.యానం, వాసాలతిప్ప, అల్లవరం మండలం పరిధిలో నక్క రామేశ్వరం గ్రామాలు తీరాన్ని ఆనుకుని ఉన్నాయి. ఈ గ్రామాలు గోదావరి నదీపాయల మధ్యలోనూ, సముద్ర తీరాన్ని ఆనుకుని ఉంటాయి, పైగా వీటి చుట్టూ మడ అడువులు ఎక్కువ. పంచాయతీలు ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ నిత్యం అపారిశుధ్యం సమస్య వేధిస్తోంది. దీంతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువ. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆయా పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలకు సరిపడా మందులను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పంపించాల్సి ఉంది. ఆ విధంగా చర్యలు చేపట్టిన దాఖలాలు స్థానికంగా కనిపించడం లేదు.

పరిసరాలు అపరిశుభ్రంగా



ఇంటి పరిసర ప్రాంతాల్లో వర్షం నీరు నిల్వ ఉండకూడదు. ఇక్కడే ఎక్కువగా బ్యాక్టీరియా వృద్ధి చెందుతోంది. డయేరియా, డీసెంట్రీ టైఫాయిడ్, కామెర్ల వ్యాధులు వచ్చే ప్రమాదం అధికం. పరిసరాలు పరిశుభ్రత లేకపోవడం దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, ఫైలేరియా మొదలగు వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. వర్షాకాలంలో ఎక్కువగా వైరల్ ఫీవర్స్, జలుబు, దగ్గు మొదలగు వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. అప్రమత్తంగా ఉండాలి.

– డాక్టర్ ఎంఎస్ రాజేష్ బాబు, వైద్యాధికారి, కేశనకుర్రు

రేపు రాష్ట్ర స్థాయి యోగా పోటీలు

అమలాపురం టౌన్: అమలాపురం రోటరీ క్లబ్ సౌజన్యంతో రోటరీ కల్యాణ మండపంలో ఈనెల 6వ తేదీన రాష్ట్ర స్థాయి యోగా పోటీలు జరుగుతాయని క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్డీఎస్ ప్రసాద్, స్వామి వివేకానంద యోగాశ్రమ గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాసలు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈ పోటీలకు అంతర్జాతీయ యోగా జడ్జి, గిన్నిస్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ కేఎస్‌వీ శ్రీధర్, రాజమహేంద్రవరం యోగా విద్యాలయ కేంద్రం కోచ్ సాయి శివాని హాజరవుతారన్నారు. పోటీల్లో పాల్గొన్న యోగా శిక్షకులకు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ధృవీకరణ పత్రాలు అందజేస్తారని అన్ని వయస్సుల వారు యోగా పోటీల్లో పాల్గొనవచ్చని యోగా గురువు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

ద్విచక్ర వాహనాల ఢీ

అమలాపురం టౌన్: బోడసకుర్రు వంతెన సమీపంలోని పేరూరు పంచాయతీ పరిధి 216 జాతీయ రహదారిపై శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ద్విచక్రవాహనదారులు గాయపడ్డారు. మలికిపురం మండలం లక్కవరానికి చెందిన అరిగెల నాగేశ్వరరావు, రుద్రరాజు పాండురంగరాజులు మోటారు సైకిల్‌పై అమలాపురం కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సన్నిహితుడిని పరామర్శించేందుకు వెళ్తుండగా ఎదురుగా అతివేగంగా ఎన్‌ఫీల్డ్ (బుల్లెట్)పై వస్తున్న వ్యక్తి ఢీకొట్టడంతో ఇద్దరికీ తీవ్రంగా గాయాలయ్యాయని పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పేద మహిళలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య నాయకులు

అమలాపురం టౌన్: మాజీ ముఖ్యమంత్రి దివంగత కొణిజేటి రోశయ్య 93వ జయంతి కార్యక్రమాన్ని స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్య వైశ్య మహాసభ ప్రతినిధుల ఆధ్వర్యంలో రోశయ్య విగ్రహానికి పూల మాలలతో నివాళులర్పించారు. ఉమ్మడి జిల్లా మహాసభ ఉపాధ్యక్షుడు వరదా సూరిబాబు మాట్లాడుతూ రోశయ్య ముఖ్యమంత్రి గానే కాకుండా ఉమ్మడి రాష్ట్ర అసెంబ్లీలో 16 సార్లు ఆర్థికమంత్రిగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ సింగంశెట్టి కుమార్, అమలాపురం పట్టణ వైశ్య సంఘం అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, కార్యదర్శి నంబూరి నరేష్, కోశాధికారి కొమ్మూరి వేంకటాచల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

15న బీసీ హాస్టల్ పునఃప్రారంభం

యానాం: యానాంలో మహాత్మా జ్యోతిరావ్ పూలే బీసీ బాలుర ప్రభుత్వ హాస్టల్‌ను ఈనెల 15నుంచి పునఃప్రారంభిస్తున్నట్లు శుక్రవారం ఆర్ఏఓ మునిస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆసక్తిగల 6వ తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్ తదితర కోర్సులు అభ్యసించే బీసీ బాలురు వారు సంబంధిత దరఖాస్తులను బీసీ వెల్ఫేర్ ఆఫీసర్, ప్రభుత్వ ఐటీఐ అందజేయాలని ఆయన సూచించారు.

విజయదుర్గ అమ్మవారికి ఆషాఢం సారె

ఐ.పోలవరం: మండలంలోని పెదమడి గ్రామంలో వేంచేసియున్న సుధామయి విజయదుర్గ అమ్మవారికి సమరసత సేవా ఫౌండేషన్ మహిళ విభాగం పర్యవేక్షణలో గ్రామస్తులు అమ్మవారికి ఆషాఢం సారెను శుక్రవారం భక్తి శ్రద్ధలతో సమర్పించారు. ముందుగా అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి శాకంబరీగా అలంకరించి మాతృమూర్తులను ఊరేగింపుగా తీసుకువచ్చారు. వివిధ రకాల స్వీట్లు, పండ్లు, పసుపు కుంకుమలు, చలిమిడి, పానకాలతో అమ్మవారికి సారెను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దంతులూరి రాఘవరాజు సుధామయి దంపతులు, సానబోయిన రాంబాబు భాగ్యలక్ష్మి దంపతులు, సమరసత సేవా ఫౌండేషన్ ముమ్మిడివరం సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ కనకారావు భక్తులు పాల్గొన్నారు.

శాకంబరీ అలంకారంలో కనకదుర్గమ్మ అమ్మవారు



శాకంబరీ అలంకారంలో కనకదుర్గమ్మ అమ్మవారు

తాళ్లరేవు: స్థానిక ప్రధాన రహదారిలోని పరదేశమ్మ పేట వద్ద వేంచేసియున్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని శాకంబరీగా అలంకరించి పూజలు నిర్వహించారు. పవిత్ర ఆషాఢమాసం శుక్రవారం సందర్భంగా ఆలయ నిర్వాహకుడు భూసారపు శ్రీనివాసరావు అమ్మవారిని కాయగూరలు, పండ్లతో విశేష అలంకరణ చేసి పూజలు చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక తవ్వకాలు అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: జిల్లా పరిధిలో అక్రమ ఇసుక తవ్వకాలు పూర్తిగా అరికట్టాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఇసుక కమిటీ సభ్యులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ప్రస్తుత వర్షాకాలంలో స్టాక్ యార్డుల ద్వారా ఇసుక విక్రయాలు నిర్వహణకు పటిష్ఠమైన ఏర్పాట్లను చేపట్టాలని ఆదేశించారు. ఇసుక లోడింగ్‌కు మిషన్లు ఏర్పాటు చేసి జాప్యాలకు తావు లేకుండా త్వరితగతిన సరఫరాయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అక్టోబర్ 15 వరకు..

రానున్న అక్టోబర్ 15 వరకు నదీ గర్భంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఇసుక తవ్వకాలు నిర్వహించరాదని ఆదేశించారు. ఇసుక విక్రయాలపై బృందాలను నియమించి ధరల వ్యత్యాసాలను గమనించి లోటుపాట్లు ఉంటే చక్కదిద్దాలన్నారు. 2009 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు ఇసుక తవ్వకాలపై అందిన స్టాక్ రిపోర్టుపై విచారణ నిర్వహించి ఏజెన్సీలు ఒప్పందం కంటే ఎక్కువ విస్తీర్ణంలో నిబంధనలు అతిక్రమించి ఎక్కువ లోతుగా తవ్వితే క్రమశిక్షణా చర్యలకు సిఫార్సు చేయాలన్నారు.

పీజీఆర్ఎస్‌ను పారదర్శకంగా నిర్వహించాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం పారదర్శకంగా సంస్కరణలను తీసుకుని వచ్చిందని జాయింట్ కలెక్టర్ టీ.నిషాంతి అన్నారు. శుక్రవారం జిల్లా స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఒక టేబుల్‌ను ఏర్పాటు చేసుకొని అర్జీదారుల నుంచి వినతులను ముందుగా స్వీకరించి ప్రాథమిక పరిశీలన చేస్తూ కిందిస్థాయి అధికారులతో పరిష్కార సరళిపై సంప్రదించి అర్జీదారులతో సహా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వేదిక వద్దకు వెళ్లి పరిష్కార స్థితిగతులపై వివరణ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్ర మంలో డీఆర్ఓ రాజకుమారి, పీజీఆర్ ఎస్ నోడల్ అధికారి పీ.కృష్ణమూర్తి, ఏవో కాశీ విశ్వేశ్వరరావు, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

రంగాకు నివాళులు



అమలాపురంలో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అమలాపురం టౌన్: రాష్ట్ర కాపు నాయకుడు, మాజీ ఎమ్మెల్యే దివంగత వంగవీటి మోహన రంగా జయంతి కార్యక్రమం స్థానిక ఎన్టీఆర్ మార్గ్‌లో పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరిగింది. ఎన్టీఆర్ మార్గ్‌లో గల రంగా విగ్రహానికి పట్టణ పార్టీ కాంగ్రెస్ అధ్యక్షుడు, కేకేసీ రాష్ట్ర అధికార ప్రతినిధి వంటెద్దు బాబి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో మాజీ ముఖ్యమంత్రి దివంగత కొణిజేటి రోశయ్య, స్థానిక ఎస్‌కేబీఆర్ కాలేజీ రోడ్డులో ఉన్న విప్లవ వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను పట్టణ కాంగ్రెస్ కమిటీ ఘనంగా నిర్వహించింది. అల్లూరి, రోశయ్య విగ్రహాలకు పార్టీ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ పార్టీ కోఆర్డినేటర్ అయితాబత్తుల సుభాషిణి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల నాయకుడు రంగా

అయినవిల్లి: మండలంలోని విలస గ్రామంలో వంగవీటి మోహన్‌రంగా జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విలస శ్రీకృష్ణదేవరాయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి రంగా చేసిన అందించిన సేవలను గుర్తు చేశారు. కమిటీ సభ్యులు అక్కిశెట్టి దుర్గరావు, కుప్పాల రాంబాబు, అమలకట్ట చక్రవర్తి, అల్లం తాసు తదితరులు పాల్గొన్నారు.

రంగాని స్ఫూర్తిగా తీసుకోవాలి

అంబాజీపేట: నేటి యువత వంగవీటి మోహన రంగా ఆశయాలకు అనుగుణంగా వాటి సాధనలో యువత నడుచుకోవాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూలు ఎదురుగా రంగా జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళ్ళర్పించారు. కార్యక్రమంలో శిరిగినీడి వెంకటేశ్వరరావు, గణపతి వీరరాఘవులు, కొర్లపాటి వెంకటేశ్వరరావు, రవణం విజయ్, సూదాబత్తుల రమేష్, శిరగం జగత్ పాల్గొన్నారు.

ఉద్యమకారుల్లో స్ఫూర్తిని రగిల్చిన అల్లూరి



అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి, ట్రైనీ ఐఎఎస్ అఖిల్ తదితరులు

ఉప్పలగుప్తం: స్వాతంత్ర్య పోరాటయోధుడు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతి వేడుకలను భీమనపల్లి పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉద్యమకారుల్లో స్ఫూర్తిని రగిల్చిన ఆయనను నేటి యువత ఆదర్శంగా తీసుకొవాలన్నారు.

లయన్స్ క్లబ్ నివాళులు

అమలాపురం రూరల్: అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా శుక్రవారం క్షత్రియ కళ్యాణ మండపం వద్ద అల్లూరి సీతారామరాజు విగ్రహానికి అమలాపురం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సూదా గణపతి క్లబ్ సభ్యులతో కలిసి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు.

మహోజ్వలశక్తి అల్లూరి

యానాం: భారతదేశ స్వాతంత్రోద్యమ చరిత్రలో అల్లూరి సీతారామరాజు మహోజ్వలశక్తి అని సాయుధ పోరాటం ద్వారా దేశానికి స్వాతంత్ర్యం తధ్యమని నమ్మి ఆఖరికి తన ప్రాణాలనర్పించిన యోధుడు అని పలువురు పేర్కొన్నారు. శుక్రవారం సమాచారశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఫెర్రిరోడ్డులో అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ బ్రిటీషు వలస పాలనకు వ్యతిరేకంగా ఆయన నాయకత్వంలో జరిగిన తిరుగుబాటు స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిందన్నారు.

తప్పుడు మస్తర్లపై చర్యలు



ఉపాధి పనుల అవకతవకలపై కూలీలను విచారిస్తున్న ఏపీడీ

అల్లవరం: రెల్లుగడ్డ గ్రామంలో ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న వెంకట రామారావు, ఎలువుల్లంక ప్రాంతానికి చెందిన మేట్ బొంతు వెంకటరమణమ్మ ఇరువురు కూలీలు రాకపోయినా మస్తర్లు నమోదు చేసి అవినీతికి పాల్పడుతున్నారని ఎలువుల్లంకకు బొంతు ఫణీంద్ర సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఉపాధి ఏపీడీ రాంబాబు రెల్లుగడ్డ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం విచారణ చేపట్టారు. వెంకట రమణమ్మ ఆమె అల్లుడు మోకా రజనీకాంత్ పేరిట ఒక వారంలో ఏడు రోజులు, మరో వారంలో మరో రోజు మస్తర్ వేసినట్లు అధికారులు విచారణలో నిర్ధారించారు. తానే తప్పు చేసినట్లుగా రమణమ్మ ఒప్పుకుందని ఏపీడీ తెలిపారు. మస్తర్లు తప్పుగా నమోదు చేసిన ఆమెను విధుల నుంచి తొలగిస్తునట్లు ఆయన పేర్కొన్నారు. ఎనిమిది రోజుల మస్తర్లకు సంబంధించిన నగదుని రికవరీ చేయాలని ఏపీఓ రాజామణిని ఆదేశించారు. ఈ వ్యవహారంపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఫీల్డ్ అసిస్టెంట్ రామారావుకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ రాజామణి, జేఈ వెంకటేశ్వరరావు, టీఏలు, కూలీలు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

తాళ్లరేవు: ప్రైవేటు, కార్పోరేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఒకటవ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థుల వరకు అధిక ఫీజులు వసూలు చేయడమే కాకుండా పుస్తకాలు, యూనిఫామ్, విద్యాసామాగ్రి తమ వద్దే కొనాలని నిబంధనలు పెట్టడం దారుణమన్నారు. కార్పోరేట్ విద్యాసంస్థలు ఒత్తిడితో పిల్లలు ఇబ్బంది పడతారని తల్లిదండ్రులు వారు చెప్పిందల్లా చేస్తున్నారన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల తీరుతో మధ్య తరగతి ప్రజలు తమ పిల్లలను ఇటు ప్రైవేటు పాఠశాలలకు పంపలేక అటు ప్రభుత్వ పాఠశాలల్లో చదివించలేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పలు స్కూళ్లలో క్రీడా ప్రాంగణాలు, మరుగుదొడ్లు కూడా ఉండడంలేదని, అయినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇకనైనా విద్యాశాఖ అధికారులు పాఠశాలల్లో ఫీజుల జులుంను అరికట్టాలని, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏడుకొండలు డిమాండ్ చేశారు.


విద్యార్థినులకు వైద్య పరీక్షలు

అమలాపురం టౌన్: అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులకు రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమంలో భాగంగా కళాశాలలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించి హిమోగ్లోబిన్, పలు రకాల పరీక్షలు చేశారు. పలువురు విద్యార్థినులకు మెరుగైన వైద్య నిమిత్తం ఆసుపత్రులకు సిఫార్సు చేశారు. హిమోగ్లోబిన్ (రక్త శాతం) తక్కువగా ఉన్న కొంత మంది విద్యార్థినుల్లో ఐరెన్ పెరగడానికి తీసుకోవాల్సిన ఆహార జాగ్రత్తలపై ప్రభుత్వ వైద్యాధికారి పొన్నాడ కోటేశ్వరరావు అవగాహన కల్పించారు. ఆశా వర్కర్లు దాసి శకుంతల, మాగాపు వెంకటలక్ష్మి శిబిరంలో సేవలు అందించారు.

లబ్ధిదారులకు సహాయపత్రాల పంపిణీ

యానాం: ప్రధానమంత్రి ఆవాస్‌యోజన పథకంలో భాగంగా పుదుచ్చేరి మురికివాడల అభివృద్ధి పథకానికి సంబంధించి రూ.10.90 లక్షల సహాయ మంజూరు పత్రాలను లబ్దిదారులకు శుక్రవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గృహనిర్మాణానికి సంబంధించి స్లమ్‌క్లియిరెన్స్ బోర్డుద్వారా మంజూరైన సొమ్మును సద్వినియోగం చేసుకోని త్వరితగతిన గృహ నిర్మాణాలను పూర్తిచేసుకొవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్లమ్‌క్లియిరెన్స్ బోర్డు జెఇ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ గురుకుల పాఠశాలల్లో దరఖాస్తుల ఆహ్వానం



సమనస గురుకుల పాఠశాల

అమలాపురం రూరల్: మహాత్మా జ్యోతిభాపూలే గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగిలిన ఖాళీలకుగాను అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శుక్రవారం జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ఓ ప్రకటనలో తెలిపారు. అమలాపురం మండలం సమనస (మత్స్యకారులు బాలురు), రామచంద్రపురం (బాలికలు), తూర్పు గోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం (బాలికలు), అనపర్తి (బాలురు), కాకినాడ జిల్లాలోని పెద్దాపురం (బాలురు), పిఠాపురం (బాలికలు), తుని (బాలురు), కరప (బాలురు) బీసీ గురుకుల పాఠశాలలో ఉన్న ఖాళీలకుగాను అర్హులైన అభ్యర్థులు ఈనెల 7వ తేదీన జరిగే ప్రవేశ పరీక్షలో మెరిట్ ఆధారంగా మిగిలిన సీట్లను భర్తీ చేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రవేశ పరీక్షలు రూరల్ మండలం సమనస గురుకుల పాఠశాల, రాజమహేంద్రవరంలోని బొమ్మూరు గురుకుల పాఠశాల, పెద్దాపురం గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్నామన్నారు. అర్హులైన అభ్యర్థులు ఆయా గురుకుల పాఠశాలలోని సంబంధిత ప్రిన్సిపాల్‌ను, పాఠశాలలోని ఆఫీస్ కార్యాలయాలలో సంప్రదించాలన్నారు.

విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

అమలాపురం రూరల్: రుతుపవనాల నేపథ్యంలో సంభవించే తుపాన్లు, గోదావరి వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రెవెన్యూ ఇతర అధికారులు సన్నద్ధం కావాలని కలెక్టర్ మహేష్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించి వరదలు విపత్తుల ఎదుర్కొనేందుకు సంసిద్ధత, రెవెన్యూ అంశాలపై ఆర్డీవోలతో తాహసీల్దార్లుతో సమీక్షించారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్లాన్‌కి సంబంధించి చేపట్టాల్సిన సహాయక చర్యలు విధివిధానాలను, మార్గదర్శకాలు రూప కల్పన చేయాలని సూచించారు. రెవెన్యూ అధికారులు మండలాలు వారిగా కార్యాచరణ ప్రణాళికలను ఈనెల 8 తేదీ నాటికి రూపొందించాలని ఆదేశించారు. తుపాన్ షెల్టర్లు, పునరావాస కేంద్రాల్లో వసతులు ఉన్నాయో లేదో పరిశీలించాలని, మరమ్మతులు ఉన్నట్లయితే సంబంధిత ఇంజనీర్ల ద్వారా చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్ఓ రాజకుమారి ఆర్డీవోలు తాహసీల్దార్లు పాల్గొన్నారు.